

# కథా కౌముది

"శ్రీ పరాభవ" నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
31 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
యువతరం కథా విభాగం విజేతలు

## సిరి ఎమ్ శర్వాణి – విశాఖ పట్నం- ఆంధ్ర ప్రదేశ్

మూడు రోజుల నుంచి ముసురు. వర్షాలకు పొలాలు, పల్లపు ప్రాంతాలు నీటిలో మునిగి పోయాయి. ఉదయం తొమ్మిది గంటలు. హాల్లో చాప మీద కూర్చొని దినపత్రిక చదువుతున్నాడు ముప్పై ఏళ్ళ బుచ్చిబాబు. అతను పేపర్లో పూర్తిగా లీనమైపోయి పరిసరాలను గమనించలేదు. కాసేపటికి, బుచ్చిబాబుకి కుడివైపున చిన్న అలికిడి. అయినా అతను గమనించలేదు. మరి కాసేపటికి, అలికిడితో పాటు ఏదో ఆకారం లీలగా కనిపించినట్టు అనిపించింది అతనికి. అప్పుడు మెల్లగా అటువైపు చూశాడు అతను. ఒక్కసారిగా గుండె ఝల్లుమంది. గొంతు తడారి పోయింది. అక్కడ ... త్రాచు పాము. చుట్ట చుట్టుకొని ... పడగ విప్పి ... బస్కీ వేసుకొని కూర్చున్న బుచ్చిబాబు తొడకి అతి సమీపంలో ... కాటు వేయాలా? వద్దా? అని ఆలోచిస్తున్నట్టు ... పాత గోడ గడియారంలోని లోలకంలా ... ముందుకీ వెనక్కీ ఊగుతోంది పాము పడగ. బుచ్చిబాబు కూర్చున్న భంగిమలో, చటుక్కున లేచి పారిపోయే అవకాశం లేదు అతనికి. ఆ ప్రయత్నం చేస్తే, పాముకాటు తప్పదు. చెమటలు పట్టేశాయి. క్షణాలు గడుస్తున్నాయి భారంగా ... భయంకరంగా ... చివరి క్షణాల్లా.

అప్పుడు ... బుచ్చిబాబుకి ఎడమ వైపు, చాప మీద ఉన్నఅతని మొబైల్ ఫోన్ రింగయ్యింది. పాములో ఏ మార్పూ లేదు. తాగుబోతు పాములా ఊగుతూనే ఉంది. ఆ మొబైల్ రింగ్ టోన్ శబ్దం సిరికి బాగా ఇష్టం. అప్పటివరకు బెడ్ రూమ్ లో ఉన్న సిరి, పరుగెత్తుతూ బుచ్చిబాబు దగ్గరికి వచ్చింది. వచ్చీరాగానే దాని దృష్టి, ఏ క్షణంలో అయినా కాటు వేయటానికి సిద్ధంగా ఉన్న పాము మీద పడింది. వెంటనే అరవటం మొదలు పెట్టింది. పాము పట్టించుకోలేదు. అసలు దానికి ఆ అరుపులు వినిపిస్తే కదా. ఇంక సిరి ఆలస్యం చెయ్యలేదు. మెరుపులా ముందుకి దూకి, పాముని నోటితో పట్టుకుని, గడప బయటకు విసిరింది.

కొంతసేపు పాము ముంగిసల పోరాటంలా, ఆ పాముకి, సిరికి పోరాటం జరిగింది. తేరుకున్న బుచ్చిబాబు సిరిని కాపాడుకోటానికి కర్ర కోసం వెతికాడు. అప్పటికే ఆలస్యం అయ్యింది. చిర్రెత్తుకొచ్చిన సిరి, పామును కొరికి రెండు ముక్కలు చేసింది. అప్పటికే సిరికి రెండు కాట్లు పడ్డాయి. తూలిపోతూ ఉంది.

:2:

క్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా, సిరిని, ఆటోలో వెటర్నరీ హాస్పిటల్ కి తీసుకు వెళ్ళాడు బుచ్చిబాబు. అప్పటికే నురగలు కక్కుతూ, అపస్మారక స్థితిలో ఉంది సిరి. వెటర్నరీ డాక్టర్ రామకృష్ణ వైద్యం మొదలు పెట్టాడు. సకాలంలో పాలీవీనం ఇంజెక్షన్ ఇచ్చాడు. సెలైన్స్ ఎక్కించాడు. పరిస్థితిని బట్టి ఇతర మందులు ఇచ్చాడు.

బుచ్చిబాబుకి భయంతో కాళ్ళూ చేతులు వణుకు తున్నాయి. తనను కాపాడటం కోసం ప్రాణాల మీదకు తెచ్చుకున్న తన ఏకైక నేస్తం, ఆత్మ బంధువు .. అన్నీ తానైన సిరి దక్కుతుందో లేదో అని హడలి పోతున్నాడు. సిరిని కాపాడమని గుర్తొచ్చిన ప్రతి దేవుడిని ప్రార్థిస్తున్నాడు అతను. జరుగుతున్న వైద్యాన్ని అతి దగ్గరగా గమనిస్తూ, క్షణం క్షణం నరకం అనుభవిస్తున్నాడు.

డా. రామకృష్ణ చేసిన చికిత్సతో, నాలుగు గంటల తర్వాత సిరి పూర్తిగా కోలుకుంది. ఒక్కసారిగా అది వైద్యం చేస్తున్న టేబుల్ పైనుంచి ఎగిరి, బుచ్చిబాబు గుండెల పైన హత్తుకు పోయింది. దాన్ని అలాగే పొదివి పట్టుకున్న బుచ్చిబాబు పరవశించి పోయాడు. తన యజమాని బ్రతికాడనే ఆనందం సిరిలో. సిరి దక్కిందనే ఆనందం బుచ్చిబాబులో. ఒకరినొకరు ముద్దులతో ముంచెత్తుతుంటే, డా. రామకృష్ణతో పాటు, హాస్పిటల్ సిబ్బంది అందరికీ కళ్ళు చెమర్చాయి.

"గట్టి పిండమే. అల్సేషన్ బ్రీడ్ కాబట్టి తట్టుకుంది. ఇంకేం భయం లేదు" బుచ్చిబాబు భుజం తడుతూ అన్నాడు డా. రామకృష్ణ.

బుచ్చిబాబు, సిరి ఇంటికి చేరుకున్నారు. అదే చాప పైన కూర్చున్నాడు అతను. ఎదురుగా సిరి నిలబడి ఉంది. " బుర్ర తక్కువ దానా .. నీకేం అవుతుందో ఆలోచించుకోవా? పాముతో అలా కలబడి పోవటమేనా? " ఉన్నట్టుండి కోపంగా అన్నాడు బుచ్చిబాబు. సిరి అమాయకంగా చూస్తూ వింటోంది. " అయినా పామును చంపే పద్ధతి అదేనా? నీకు అసలు తెలివి ఉందా? వేస్ట్ ఫెలో" మళ్ళీ తిట్టాడు. మాటలు అర్థం కాకపోయినా, మందలింపు అర్థమైన సిరి, బుంగ మూతి పెట్టి, మూలుగుతూ నేల చూపులు చూసింది.

:3:

" పామును చంపాలంటే మీ అమ్మ తర్వాతే ఎవరైనా. కన్ను మూసి తెరిచేంతలో, ఒక్క కాటు కూడా పడకుండా, పాముని పీసులు పీసులు చేసేసింది మీ అమ్మ తెలుసా? నువ్వూ ఉన్నావు ఎందుకు?" బుచ్చిబాబు మాటలకి తల వంచుకుంది సిరి.

" అన్నట్టు నీకు మీ అమ్మ గురించి తెలియదు కదా. చూపిస్తాను ఉండు" అంటూ లోపలికి వెళ్ళి, ఒక పాత ఫోటో ఆల్బమ్ తెచ్చాడు బుచ్చిబాబు. దాన్ని సిరి ముందు పెట్టాడు. ఒక్కో షీట్ తీశాడు. " ఇదిగో. ఇది మీ అమ్మమ్మ. నువ్వే కాదు, నేను కూడా చూడలేదు లే మీ అమ్మమ్మని. మీ అమ్మమ్మ పేరు సిరి." సిరి ఆ ఫోటోని ఆసక్తిగా చూసింది. బుచ్చిబాబు ఇంకో షీట్ తీశాడు. " ఇది మీ అమ్మ. మీ అమ్మ పేరు కూడా సిరినే. నవ్వుతూ అన్నాడు బుచ్చిబాబు " సిరి వింతగా చూసింది ఆ ఫోటోల వైపు. " మీ అమ్మ పక్కన ఉన్న ఈ అబ్బాయి ఎవరో తెలుసా? నీకు తెలీదులే. అది నేనే" నవ్వాడు అతను. " ఇదిగో .. ఇది నువ్వే. నీ చిన్నప్పటి ఫోటో" బుచ్చిబాబు ఒక్కొక్క షీట్ తీస్తుంటే సిరి ఆనందంగా చూసింది. తన చిన్నప్పటి ఫోటో చూడగానే, బుచ్చిబాబు జ్ఞాపకాలు ఇరవై ఏళ్ల వెనక్కి వెళ్ళాయి.

పదేళ్ళ బుచ్చిబాబు తన వైపు తాను చూసుకున్నాడు. ఒంటిపై అక్కడక్కడా స్కేలుతో కొట్టిన దెబ్బలు. చర్మం కమిలిపోయిన గుర్తులు. చెంపలపైన ఉన్న చేతి గుర్తులు అతనికి కనిపించ లేదు. జుట్టు పట్టి లాగి కొట్టటం వలన చిందర వందర అయిన జుట్టు కూడా అతనికి కనిపించలేదు. ఒళ్ళంతా పచ్చి పుండులా ఉంది. దుఖం ఆగలేదు చిట్టిబాబుకి. గతం గుర్తొచ్చింది.

ఐదో తరగతి చదువుతున్నప్పుడు బుచ్చిబాబు తల్లీ తండ్రీ ఒక ప్రమాదంలో చనిపోయారు. దగ్గరి బంధువులు చిట్టిబాబుని వెంటతీసుకు వెళ్ళారు. జాలిపడి కాదు. శవ సంస్కారానికి వచ్చిన జనం ముందు గొప్పకి. తీసుకెళ్ళిన వారం రోజుల తర్వాత, బుచ్చిబాబుని పట్టణంలో ఒక కలిగిన కుటుంబంలో పనిమనిషిగా పెట్టి చేతులు దులుపుకున్నారు ఆ బంధువులు. కష్టం బుచ్చిబాబుది, జీతం బంధువులది.

:4:

బుచ్చిబాబు ఆ ఇంటలో పనికి కుదిరి సంవత్సరం అయ్యింది. పనికి చేరిన మొదట్లో, విలాసవంతమైన పెద్ద ఇల్లు, కారు, స్కూటర్లు, పెద్ద టీవీ, కుక్క .. అన్నీ చూసి సంబర పడ్డాడు బుచ్చిబాబు. ఆ తర్వాతే తెలిసింది అతనికి ఆ ఇల్లు ఎంత నరకమో. ఉదయం ఆరు గంటలకి నిద్ర లేవాలి. రాత్రి పదకొండు , పన్నెండు వరకు గొడ్డులా కష్టపడాలి. ఇల్లు ఊడ్వటం నుంచి కారు కడిగే వరకు అన్ని పనులు అతనే చెయ్యాలి. డైనింగ్ టేబుల్ పైన ఎంగిలి ప్లేట్లు అతనే తీసి కడగాలి. టాయిలెట్లు అతనే కడగాలి.

ఇంటి యజమానులు పెంచుకుంటున్న కుక్క సిరిని తోటలో తిప్పటం, దాని స్నానం, వేళ ప్రకారం రకరకాల ఆహారాలు తినిపించటం, దాని మలమూత్రాలు శుభ్రం చేయటం .. అన్నీ బుచ్చిబాబు పనిలో భాగాలే.

ఆరోజు సిరికి స్నానం చేయించటం రెండు గంటలు ఆలస్యమయ్యింది. కారణం కరెంట్ లేకపోవటం. గీజర్ పని చెయ్యదు. సిరికి స్నానం వేడి నీళ్ళతోనే చేయించాలి. కరెంట్ వచ్చిన తర్వాత సిరికి స్నానం చేయించి, టవల్ తో ఒళ్ళు తుడుస్తున్నాడు బుచ్చిబాబు. అది చూసిన ఇంటి యజమాని నారాయణరావు కోపం నషాళానికెక్కింది. సిరికి స్నానం ఆలస్యంగా చేయిస్తావా? అంటూ బుచ్చిబాబుని పట్టుకొని, విచక్షణ లేకుండా తుక్కు తుక్కుగా కొట్టాడు. అప్పుడే అక్కడికొచ్చిన నారాయణరావు భార్య, విషయం తెలుసుకొని, టేబుల్ పైన ఉన్న స్కేల్ తో కసితీరా కొట్టింది. ఆ తర్వాత వాళ్ళ కూతురు వంతు వచ్చింది. బుచ్చిబాబుని జుట్టు పట్టుకొని లాగి, వీపుమీద పిడి గుద్దులు వేసింది. చివర్లో వచ్చిన నారాయణరావు కొడుకు బుచ్చిబాబు చెంపలు పగల గొట్టాడు. కాళ్లతో తన్నాడు.

కారణం అడక్కుండానే జరిపిన దాడిలో బుచ్చిబాబు కిందపడిపోయి విలవిల్లాడాడు. “ నా తప్పేం లేదు అయ్యగారు. కరెంట్ లేదు. ఏడి నీళ్ళు లేక ..” ఆపైన మాట్లాడ లేకపోయాడు. ఆ మాటవిని గతుక్కుమన్న నలుగురు కుటుంబ సభ్యులు అక్కడి నుంచి జారుకున్నారు.

:5:

రాత్రి పదకొండు గంటలు. ఒంటి నిండా దెబ్బలతోనే ఆరోజంతా పని చేశాడు బుచ్చిబాబు. జరిగిన దానికి ఎవరూ పశ్చాత్తాపం చూపించలేదు. తన మీద తనకే జాలేసింది బుచ్చిబాబుకి. జాలితో పాటు విరక్తి కూడా. ఆ ఇంట్లోని కుక్కకి ఉన్న విలువలో వెయ్యో వంతు విలువ కూడా తనకి లేనందుకు బాధపడ్డాడు. దానికి రోజూ స్నానానికి ఖరీదైన సువాసన సబ్బు. తనకేమో ఎర్రసబ్బు. కుక్కకి హార్లిక్స్ కలిపిన చిక్కని పాలు. తనకి టీ. కుక్కకి షాపులో కొన్న ఖరీదైన ఆహారం. అందులో మళ్ళీ రకరకాలు. కృత్రిమ ఎముకలు. ఆడుకునే బొమ్మలు, బంతులు. రోజూ గుడ్డు. వారానికోసారి చికెన్ బిర్యానీ, ఒకసారి మటన్. బిస్కెట్లు, స్వీట్లు. పడుకోటానికి మెత్తని పరుపు. తనకి మాత్రం మిగిలిపోయిన, పాచిపోయిన అన్నం కూరలు. వాడకంలో లేని పాత పార్కింగ్ షెడ్ కి తడికలు తగిలించి, అందులో ఉండమన్నారు. అది కూడా జాలిపడి ఇచ్చిన వసతి కాదు. రాత్రీ పగలు, ఎప్పుడు పడితే అప్పుడు చాకిరీ చేయించుకోటానికి, అందుబాటులో ఉండాలి కాబట్టి, అక్కడే కట్టి పడేసే బందల దొడ్డి అది. మనిషి అయినా తనని కుక్కని కొట్టినట్టు కొట్టారు. కుక్కని మాత్రం మనిషి కంటే గొప్పగా చూసుకుంటున్నారు.

ఎప్పుడొచ్చిందో తెలీదు. తడిక రంధ్రంలోంచి చూస్తున్న సిరి కనిపించింది. దాన్ని చూడగానే ఆ ఇంట్లో దానికీ తనకి ఉన్న తేడా తలుచుకున్నాడు. ఉన్నట్టుండి బుచ్చిబాబుకి సిరి పైన విపరీతమైన కోపం వచ్చింది. అసలు ఈరోజు తాను దెబ్బలు తినటానికి కారణం అదే. దానికి సేవలు చేసేది తాను అయితే, అది ప్రేమను చూపించేది మాత్రం యజమానులకి. ఛీ … దీనికి అసలు విశ్వాసమే లేదు. ఎప్పుడో ఒకసారి దీని పీక పిసికెయ్యాలి అన్నంత కోపం వచ్చింది బుచ్చిబాబుకి.

తెల్లవారింది. బుచ్చిబాబు శరీరం జ్వరంతో కాలిపోతుంది. బాధగా మూలుగుతూ అలాగే పడుకున్నాడు. నారాయణరావు వచ్చి పిలిచాడు. బుచ్చిబాబు మాట్లాడే శక్తి లేనివాడిలా అలాగే పడుకున్నాడు. నారాయణరావు బాధపడ్డాడు. బుచ్చిబాబుకు జ్వరం వచ్చినందుకు కాదు, ఇంట్లో పనులన్నీ ఎక్కడివక్కడ ఆగిపోయినందుకు. అన్నింటికీ మించి సిరిని

:6:

చూసుకునేవారు ఎవరూ లేరు. అసలే సిరికి అల్లరెక్కువ. అందుకే ఆరోజు గొలుసు విప్పకుండా అలాగే కట్టేసి పాలు పోశాడు. సిరి తాగలేదు. హార్లిక్స్ కలిపి పోశాడు. సిరి వాసన కూడా చూడలేదు. మటన్ కలిపిన అన్నం పెట్టాడు. సిరి దాని వైపు కూడా చూడలేదు. చిన్నగా అరుస్తూ గొలుసు విప్పుకోటానికి ప్రయత్నిస్తోంది. నారాయణరావుకేమీ అర్థంకాలేదు. వెంటనే వెటర్నరీ డాక్టర్ మల్లేశ్వరరావుని పిలిపించాడు. డాక్టర్ మల్లేశ్వరరావు సిరిని చూసి, దాని దినచర్య మొత్తం తెలుసుకొని నవ్వి అన్నాడు.

“ట్రీట్మెంట్ ఇవ్వాల్సింది సిరికి కాదు" “మరి ?" అయోమయంగా అడిగాడు నారాయణరావు.

“ముందు దాని గొలుసు విప్పండి”. నారాయణరావు గొలుసు విప్పాడు. అంతే! చెంగున పరుగెత్తింది సిరి. డాక్టర్, నారాయణరావు ఇద్దరూ అదెక్కడికెళ్ళిందో చూడాలని అటు వైపు వెళ్లారు. అక్కడ–

జ్వరంతో మూలుగుతూ పడుకున్న బుచ్చిబాబుని కాళ్ళతో కదుపుతూ, చేతిని నాకుతూ నెమ్మదిగా అరుస్తోంది సిరి. నారాయణరావు మనసులో చిన్న కదలిక. రోజూ తిండి పెట్టిన విశ్వాసానికి, ఒక రోజు బుచ్చిబాబు కనిపించకపోయేసరికి, అల్లాడిపోయి తిండి మానుకున్న మూగ జీవి, తన ప్రేమను ఈ విధంగా ప్రకటిస్తోంది. మరి తను ? రోజంతా గొడ్డులా చాకిరీ చేస్తున్నా, కుక్క కన్నా హీనంగా చూశాడు. జ్వరంతో కాలిపోతుంటే చీమ కుట్టినట్లు కూడా అనిపించలేదు.

ఓ నిర్భాగ్యుడి మీద నోరులేని ఆ మూగజీవికున్న ప్రేమ, సాటి మనిషైన తనకు లేదు. సిగ్గుతో తలవంచుకున్నాడు నారాయణరావు, డాక్టర్ మల్లేశ్వరరావు వెళ్లిపోయాడు. డాక్టర్ మాటలు గుర్తొచ్చాయి. నిజమే ! ట్రీట్మెంట్ అవసరమైంది బుచ్చిబాబుకి కాని, సిరికి కాదు. తనకు తనలాంటి చాలా మంది మనుషులకు ట్రీట్మెంట్ అవసరం.

:7:

మరోగంటలో బుచ్చిబాబు ఖరీదైన ఆసుపత్రిలో ఉన్నాడు. కసి తీర్చుకోవాలనుకున్న సిరి తోక ఊపుతూ ఒడిలో ఆడుకుంటుంటే, ఆత్మీయంగా దాన్ని ఎత్తుకుని ముద్దు పెట్టుకున్నాడు బుచ్చిబాబు. ఆ సన్నివేశం నారాయణరావుకి చాలా అందంగా కనిపించింది. అతన్ని పూర్తిగా మనిషిగా మార్చింది.

కారులోంచి బుచ్చిబాబును దించి, చెయ్యి పట్టుకొని, అతను ఉండటానికి నివాసంగా ఇచ్చిన కార్ షెడ్ లోకి తీసుకు వెళ్ళాడు నారాయణరావు. సిరి అనుసరించింది. బుచ్చిబాబు పడుకునే చాపను వేశాడు నారాయణరావు. దానిపైన పరచటానికి దుప్పటి తీశాడు. అంతే … దానికింద దూరి ఉన్న త్రాచు పాము బుస్సున పైకి లేచింది.

ఒకవైపు నారాయణరావు. మరోవైపు బుచ్చిబాబు. ఇంకోవైపు సిరి. ముగ్గురి మధ్య సమాన దూరంలో పాము. తనకి ఎవరి వల్ల హాని జరుగుతుందో, ఎవరిపై ముందు దాడి చెయ్యాలో తెలీక, ముగ్గురి వైపు స్ప్రింగ్ లా మెడ తిప్పుతూ చూస్తోంది పాము. ఆ హఠాత్పరిణామానికి షాకైన నారాయణరావు, బుచ్చిబాబు, భయంతో కదలకుండా బిగుసుకు పోయాను. సిరి తేరుకుంది. మెరుపులా ముందుకి దూకింది. సరిగ్గా పాము పడగ క్రింది భాగాన్ని ఒడుపుగా పట్టుకొని, చటుక్కున కొరికి రెండు ముక్కలు చేసింది.

పెంచి పోషిస్తున్న యజమానిని, సేవలు చేసే ఆత్మీయ నేస్తాన్ని ఒకేసారి కాపాడి, తనని తాను కూడా కాపాడుకున్న సిరి వైపు ప్రేమగా, కృతజ్ఞతగా చూశారు నారాయణరావు, బుచ్చిబాబు.

ఆ క్షణమే బుచ్చిబాబు నివాసాన్ని మార్చేశాడు నారాయణరావు. ఇంట్లో మరో ఆడ పనిమనిషిని పెట్టి, బుచ్చిబాబుకి పనిభారం తగ్గించాడు. బుచ్చిబాబును ప్రేమగా చూడటం మొదలు పెట్టాడు. బుచ్చిబాబు జీతాన్ని అతని బంధువులకి కాకుండా, బుచ్చిబాబుకే ఇచ్చాడు.

జీతం చేతిలో పడగానే జీవితం పైన ఆశ కలిగింది బుచ్చిబాబుకి. ఐదో తరగతిలో ఆగిపోయిన చదువుని ఎంతో కొంత ముందుకి తీసుకు వెళ్ళాలి అనుకున్నాడు. పదేళ్లలో పెళ్ళీడు వస్తుంది. పెళ్ళి చేసుకోవాలి. భార్యా బిడ్డలకు మంచి జీవితాన్ని ఇవ్వాలి. గౌరవప్రదంగా బ్రతకాలి. తన ప్రాణాలు కాపాడిన సిరి వంశాన్ని తాను కాపాడాలి... ఎన్నెన్నో ఆలోచనలు.

**:8:**

క్రమంగా తన ఆలోచనలను అమలుచేయటం మొదలు పెట్టాడు బుచ్చిబాబు. డిస్టెన్స్ ఎడ్యుకేషన్ కి దరఖాస్తు చేశాడు. ముందు పదోతరగతి పాసయ్యాడు. ఇరవై ఏళ్ళు వచ్చేటప్పటికి ఇంటర్, డిగ్రీ పూర్తి చేశాడు.

ఆ తర్వాత ఆన్ లైన్లో, మొబైల్ రిపేరింగ్ కోర్స్ చేశాడు. నారాయణరావు ఇంట్లో పనిచేస్తూనే, అతని అనుమతితో ఒక పూట బయట మొబైల్ షాపులో పని నేర్చుకున్నాడు. ఆరు నెలల్లో అదే షాపులో ఉద్యోగం పొందాడు.

నారాయణరావు ఇంటి నుంచి, " పని మనిషి" పని లోంచి బయట పడ్డాడు బుచ్చిబాబు. చిన్న గది అద్దెకు తీసుకున్నాడు.

తొలిజీతం వచ్చిన రోజు, స్వీట్ బాక్స్ తీసుకొని నారాయణరావు ఇంటికొచ్చాడు బుచ్చిబాబు. సిరికి ఇష్టమైన కేక్ ముక్కలు తెచ్చాడు. అతని ఎదుగుదలకి ఆ ఇంట్లో అందరూ సంతోషపడ్డారు. నారాయణరావును ఒక కోరిక కోరాలని అనుకొని, అడగలేక తటపటాయించాడు బుచ్చిబాబు. అదే సమయంలో, సిరి మూడు వారాల ముందు ఈనిన తన మూడు పిల్లలలో, ఒకదాన్ని నోటితో పట్టుకొచ్చి బుచ్చిబాబు ముందు పెట్టింది. తన మనసులోని కోరిక ఆ మూగ జీవికి ఎలా అర్థం అయ్యిందో తెలీక ఆశ్చర్య పోయాడు బుచ్చిబాబు. పట్టరాని సంతోషంతో పొంగిపోయాడు.

మెల్లగా ఇంటికి కావలసిన వస్తువులు ఒక్కొక్కటి సమకూర్చుకున్నాడు చిట్టిబాబు. ఒక కుటుంబానికి కావలసిన వసతులు అన్నీ ఏర్పడ్డాయి. పదేళ్లలో ఒక ఇల్లు కొనుక్కున్నాడు. పెళ్ళికి సిద్ధం అయ్యాడు.

జ్ఞాపకాల తెరల్లోంచి బయటకు వచ్చాడు బుచ్చిబాబు. ఎదురుగా ఆల్బమ్ లోని ఫోటోలను ఆసక్తిగా చూస్తున్న సిరి.

తన జీవితంలో ఒకనాడు తుఫాను రేపిన సిరి ... ఆ మర్నాడే తన జీవితాన్ని ఉహించని మలుపు తిప్పిన సిరి ... అదేరోజు తన ప్రాణాలు కాపాడిన సిరి ... తన బిడ్డని స్వయంగా తానే అప్పగించిన సిరి ... ఈరోజు తన కళ్ళముందు ఉన్న ఆనాటి ఆ చిన్నారి సిరి ... మరోసారి తన ప్రాణాలు కాపాడిన ఈ సిరి ... ఏ జన్మదో ఈ బంధం ... ఈ అనుబంధం అనుకుంటూ సిరిని ఎత్తుకొని గుండెలకు హత్తుకున్నాడు బుచ్చిబాబు. ★★★★★★★★★★★★★